పాలకుర్తి వాణి
మన పల్లె.. మన ముచ్చట్లు

WANTED విలేకరులు కావలెను
పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..
9866366702, 9963261745

సంపుటి : 01 | సంచిక : 32 | వరంగల్ | శుక్రవారం, 10 అక్టోబర్ 2025 | పేజీలు : 02

# తెలంగాణ లోకల్ బాడీ ఎన్నికల నిలిపివేత

- స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే
- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు

**పాలకుర్తి వాణి, హైదరాబాద్:**

తెలంగాణ లోకల్ బాడీ ఎన్నికలు నిలిపివేస్తూ హైకోర్టు స్టేతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు సైతం జారీ చేసింది. జీవో నంబర్ 9పై హైకోర్టు స్టే విధించి.. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో విచారణలో భాగంగా ఏజీ సుదర్శన్‌రెడ్డి తన వాదనలు వినిపించారు. 57.6 శాతం బీసీ జనాభా ఉందని సర్వేలో తేలిందని, బీసీల సంఖ్యపై ఎలాంటి అభ్యంతరం లేనప్పుడు పిటిషనర్లకు రిపోర్ట్ ఎందుకు?, బిల్లుపై ఒక్క పార్టీ కూడా అభ్యంతరం తెలపలేదన్నారు. గవర్నర్ గడువులోగా ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుందని, తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఏజీ సుదర్శన్ రెడ్డి.. నోటిఫికేషన్ విడుదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వేరు, లోకల్ బాడీ ఎన్నికల రిజర్వేషన్లు వేరని, ఇందిరా సహాని కేసు విద్య, ఉద్యోగాలకు సంబంధించినదని వివరించారు. మేం రాజకీయ రిజర్వేషన్ల కోసమే జీవో తెచ్చాం అని వివరించారు. మళ్లీ నాలుగు వారాల తర్వాత రిజర్వేషన్ల అంశంపై విచారణ జరగనుంది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది.





## ఆర్‌టీఐ దరఖాస్తుల్లో జిల్లాకి దక్కిన అవార్డు

- గవర్నర్ జిష్ణు దేవ శర్మ చేతులమీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్

**పాలకుర్తి వాణి, జనగామ ప్రతినిధి:** సమాచార హక్కు చట్టం వారోత్సవాలు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించారు. బెస్ట్ పెర్ఫార్మెన్స్ డిస్ట్రిక్ట్, బెస్ట్ PIO, బెస్ట్ డిపార్ట్మెంట్ ఇన్ డిస్పోజల్ ఆఫ్ ఆర్టీఐ కేసెస్ మొదలగు ఏడు విభాగాల్లో పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ క్రమం లో గవర్నర్ విష్ణు దేవ్ శర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అవార్డును అందుకున్నారు. ఆర్‌టీఐ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. పెండింగ్ లేకుండా వ్యవహరిస్తున్నందుకు బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ గా జనగామ జిల్లా ఎంపిక అయిన సందర్భంగా కలెక్టర్ ఈ అవార్డు ను తీసుకున్నారు. జిల్లాకి వివిధ అంశాల్లో అనేక అవార్డులు వస్తున్నందుకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దిశా నిర్దేశం లో వివిధ శాఖల అధికారులు గా పని చేయడం గర్వంగా ఉందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ కి శుభాకాంక్షలు తెలిపారు.



## నేడు రాష్ట్ర బంద్‌కు తీన్మార్ మల్లన్న పిలుపు

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. జీవో అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కోర్టు తీర్పుపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీన్మార్ మల్లన్న స్పందించారు. శుక్రవారం తెలంగాణ బంద్ కు పిలుపునిచ్చారు. అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టాలన్నారు.



## 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు..

### టీపీపీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

పాలకుర్తి వాణి, హైదరాబాద్ : బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. చట్టాలపై నమ్మకం ఉందని, ప్రభుత్వ ఆదేశాలు చట్టాలకు లోబడే ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంతో తెలంగాణ ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని తెలియజేసిన ఆయన.. స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఆయా నాయకుల పార్టీలకు ఓటమి తప్పదని తప్పదన్నారు.

# బీసీ రిజర్వేషన్ల అడ్డుకునేందుకు బీజేపీ, బీఆరెస్ కుట్ర

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమార స్వామి మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం అంశంలో బీఆర్ఎస్, బీజేపీ వాళ్లకు చిత్తశుద్ధి లేదన్నారు. గ్రామ పంచాయితీ, మండల పరిషత్ జిల్లా పరిషత్ లలో తాము ఎలాగూ విజయం సాధించలేమనే భావనతో కోర్టు తలుపులు తట్టి తమ అక్కసు వెళ్లగక్కిన ఈ పార్టీలు బీసీలకు అధికారం అందరాదనే కుట్రలు పన్నుతున్నాయన్నారు. అసెంబ్లీ తీర్మానం చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రద్దు పరచుటకై పూనుకుంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మెన్ చిలువేరు కృష్ణమూర్తి, ఐలమ్మ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోనె అశోక్ రెడ్డి, ఎక్స్ ఎంపీపీ కారు పోతుల శ్రీనివాస్, ఎస్సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జలగం కుమార్, మాజీ



కోఆప్షన్ మేంబర్ ఎండి మదార్, పాలకుర్తి టౌన్ అధ్యక్షులు కమ్మగాని నాగయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షులు ఐలేష్ యాదవ్, సేవాదళ్ గుగ్గిల ఆదినారాయణ, తీగారం మాజీ సర్పంచ్ పోగు శ్రీనివాస్, ముత్తరం మాజీ ఎంపిటిసి బొమ్మగాని భాస్కర్ గౌడ్, ఈరవెన్ను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిర్రు సోమేశ్వర్, మండల నాయకులు ఎండి సలీం, పెనుగొండ రమేష్, వి ఆర్ ఫౌండేషన్ అధినేత మోలుగురి యాకయ్య గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి నల్లమస రమేష్‌గౌడ్, ఉప్పలయ్య గౌడ్, బండపల్లి వెంకన్న గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# పొగాకు రహిత సమాజం నిర్మించడమే ధ్యేయం

**పాలకుర్తి వాణి, జనగామ ప్రతినిధి :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. మల్లిఖార్జున జనగాం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని NCD క్లినిక్ ను గురువారం సందర్శించారు. సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. పొగాకు రహిత యువత ప్రచారం అవగాహన ప్రదర్శనలో జిల్లా వైద్యాధికారి పాల్గొన్నారు. పొగాకు పదార్థాల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ పొగాకు పదార్థాలకు స్వస్తి చెప్పి ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలో కనీసం ఒక శిక్షణ కార్యక్రమం నిర్వహించి, పాఠశాల ఉపాధ్యాయులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు వంటి వారికి పొగాకు నియంత్రణ చర్యలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో NCD Clinic వైద్యాధికారి డాక్టర్ కీర్తన, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీల నోటికాడ ముద్ద లాక్కున్నారు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



**పాలకుర్తి వాణి, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు.. బీసీల నోటికాడ ముద్దను ఆపారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్పందన చూశాక బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు. కొంతమంది బీసీలకు పదవులు వస్తుంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. త్వరలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు.

## బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. అందుకే ముందగానే ప్లాన్ 'బీ'ని సిద్ధం చేసుకుని ఇవాళ హైకోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించిందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే.. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50శాతం క్యాప్‌ను నిర్దేశించిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించిందని పేర్కొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం

**పాలకుర్తివాణి, పెద్దవంగర:** లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు పోషణమాసం, అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో గురువారం నిర్వహించారు. పెద్దవంగర లయన్స్ క్లబ్ అధ్యక్షులు తంగళ్ళపల్లి మల్లికార్జున చారి సరస్వతి దేవి పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయంలో పూజలు చేసిన పలకలను అంగన్వాడి విద్యార్థులకు అందించారు. అంగన్వాడి టీచర్లు పోషణమాసంను తెలియజేసారు. లయన్స్ క్లబ్ జెడ్సి చిదిరాల నవీన్, ఆర్సి దామెర సరేష్ పాల్గొని పెద్దవంగర లయన్స్ క్లబ్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర ప్రతినిధులు ఎడవల్లి మధుసూదన్ రెడ్డి, ముత్తినేని శ్రీను, కేసరబోయిన సుభాష్, జలగం సతీష్, అంగన్వాడి ACDPO విజయ లక్ష్మి, సూపర్వైజర్స్ శోభా, శ్రీదేవి, సునీత, అంగన్వాడి టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






## విద్యార్థిని శ్రావణికి సన్మానం

**పాలకుర్తి వాణి, పాలకుర్తి టౌన్:** జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని ప్రగతి విద్యానిలయంలో పదవ తరగతి వరకు విద్యనభ్యసించిన తీగారం గ్రామానికి చెందిన పోగు శ్రావణి ఎంబిబిఎస్ లో సీటు సాధించిందని ప్రిన్సిపాల్ వీరమనేని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి, ఆమె తండ్రి నాగరాజును పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు సన్మానించారు. శ్రావణి మిగతా విద్యార్థులకు ప్రేరణగా నిలిచిందని, పాఠశాల స్థాయిలో అందించిన బేసిక్స్ ఆమె ఎదుగుదలకు ఉపయోగ పడ్డాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆమెకు ఎంబిబిఎస్ సీటు రావడం పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341